# నిషాంక 210*

### లంక తరఫున వన్డేల్లో తొలి ద్విశతకం

### అఫ్గానిస్థాన్‌పై భారీ విజయం

పల్లెకెలె: ఓపెనింగ్ బ్యాటర్ పాథుమ్ నిషాంక (139 బంతుల్లో 210 నాటౌట్; 20 ఫోర్లు, 8 సిక్సర్లు) అజేయ ద్విశతకంతో చెలరేగడంతో అఫ్గానిస్థాన్‌తో జరిగిన తొలి వన్డేలో శ్రీలంక విజయం సాధించింది. లంక తరఫున వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా నిషాంక చరిత్రకెక్కాడు. 2000లో టీమ్‌ఇండియాపై జయసూర్య చేసిన 189 స్కోరు రెండో స్థానానికి చేరింది. తొలి బంతి నుంచే నిషాంక విజృంభించడంతో మొదట బ్యాటింగ్ చేసిన లంక నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 381 పరుగులు చేసింది. అవిష్క ఫెర్నాండో (88), సదీర సమరవిక్రమ (45) ఆకట్టుకున్నారు. అఫ్గాన్ బౌలర్లలో ఫరీద్ అహ్మద్ రెండు వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో అఫ్గాన్ కూడా ఆకట్టుకుంది. భారీ టార్గెట్ కండ్ల ముందు ఉన్నా.. ఏమాత్రం అదరక బెదరక తుదికంటా పోరాడి 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 339 పరుగులు చేసింది. 55 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన దశలో అజ్మతుల్లా ఒమర్జాయ్ (115 బంతుల్లో 149 నాటౌట్; 13 ఫోర్లు, 6 సిక్సర్లు), మహమ్మద్ నబీ (136; 15 ఫోర్లు, 3 సిక్సర్లు) అసాధారణ పోరాటం కనబర్చారు. లంక బౌలర్లలో ప్రమోద్ 4 వికెట్లు తీశాడు.


పాథుమ్ నిషాంక (210*)

# సెమీస్‌లో అమిత్

### స్ట్రాంజా బాక్సింగ్ టోర్నీ

సోఫియా(బల్గేరియా): ప్రతిష్ఠాత్మక స్ట్రాంజా స్మారక బాక్సింగ్ టోర్నీలో భారత బాక్సర్ల హవా కొనసాగుతున్నది. శుక్రవారం జరిగిన వేర్వేరు విభాగపు బౌట్లలో అమిత్ పంగల్, సచిన్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లారు. పురుషుల 51కిలోల క్వార్టర్స్‌లో అమిత్ 5–0తో అల్దారిచ్ బతుల్గా(మంగోలియా)పై అద్భుత విజయం సాధించాడు. టోర్నీలో తనదైన జోరు కనబరుస్తున్న అమిత్..టైటిల్ ఫైట్‌కు మరో అడుగుదూరంలో నిలిచాడు. బౌట్ విషయానికొస్తే..ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన పంగల్.. ప్రత్యర్థిని పదునైన పంచ్‌లతో విరుచుకుపడ్డాడు. తన అనుభవాన్నంతా కూడదీసుకున్న ఈ హర్యానా బాక్సర్...మూడు రౌండ్లలో ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెడుతూ కీలక పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు 57కిలోల క్వార్టర్స్ పోరులో సచిన్ 4–1తో కపాన్ గియోర్గీ(జార్జియా)పై విజయంతో సెమీస్‌లోకి అడుగుపెట్టాడు. బౌట్‌లో కుదురుకునేందుకు కొంత సమయం తీసుకున్న సచిన్..ఆ తర్వాత ప్రత్యర్థి బాక్సర్‌కు ఎక్కడా అవకాశమివ్వలేదు. ప్రతిదాడులతో బౌట్‌ను తన వశం చేసుకున్నాడు. శనివారం జరిగే సెమీస్‌లో అబ్దురెమోవ్ ఏదర్(ఉక్రెయిన్)తో సచిన్ తలపడనున్నాడు. నవీన్‌కుమార్(92కి) సెమీస్‌లోకి అడుగుపెట్టగా, జుగ్ను(86కి), సాగర్(92కి) టోర్నీ నుంచి నిష్క్రమించారు.



### సెమీస్‌లో నాగల్

చెన్నై: భారత యువ టెన్నిస్ ప్లేయర్ సుమీత్ నాగల్.. చెన్నై ఓపెన్ సెమీఫైనల్లో ప్రవేశించాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో నాగల్ 6–3, 6–3తో డొమినిక్ పలన్ (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించాడు. రెండో సీడ్‌గా బరిలోకి దిగిన నాగల్.. వరుస సెట్లలో ప్రత్యర్థి పని పట్టాడు. మూడు ఏస్‌లు సంధించిన నాగల్.. 3 బ్రేక్ పాయింట్లు కైవసం చేసుకున్నాడు. ఇదే టోర్నీ పురుషుల డబుల్స్‌లో సాకేత్–రామ్‌కుమార్.. రిత్విక్–నిక్కి పునాచ జోడీలు ఫైనల్‌కు అర్హత సాధించాయి.

# తన్మయ్, తిలక్ తడాఖా

### హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ 383/5 • నాగాలాండ్‌తో రంజీ ప్లేట్ గ్రూప్ సెమీస్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: కెప్టెన్ తిలక్ వర్మ (135 బంతుల్లో 101; 6 ఫోర్లు, 5 సిక్సర్లు), తన్మయ్ అగర్వాల్ (192 బంతుల్లో 164; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీలతో కదం తొక్కడంతో.. నాగాలాండ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్ సెమీఫైనల్లో హైదరాబాద్ భారీ స్కోరు దిశగా సాగుతున్నది. లీగ్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ బోనస్ పాయింట్లతో గెలిచిన హైదరాబాద్.. గ్రూప్ సెమీస్‌లో నాగాలాండ్‌తో తలపడుతున్నది. సొంతగడ్డపై జరుగుతున్న ఈ పోరులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు కోల్పోయి 383 పరుగులు చేసింది. తన్మయ్ భారీ సెంచరీ బాదగా.. తిలక్ వర్మ దుమ్మురేపాడు. రోహిత్ రాయుడు (59; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. నితీశ్ రెడ్డి (21), ప్రజ్ఞయ్ రెడ్డి (12) క్రీజులో ఉన్నారు. నాగాలాండ్ బౌలర్లలో జొనాథన్ రెండు వికెట్లు పడగొట్టాడు.


తన్మయ్ (164)


తిలక్ (101)




# ‘భారత్ కంపుకొడుతున్నది’

### సెర్బియా టెన్నిస్ స్టార్ వివాదాస్పద వ్యాఖ్యలు

ముంబై: సెర్బియా టెన్నిస్ స్టార్ డెజనా రడనోవిచ్ వివాదస్పద వ్యాఖ్యలతో వార్తల్లోకెక్కింది. బెంగళూరు, పుణె, ఇండోర్, ముంబైలో జరిగిన ఐటీఎఫ్ టోర్నీల్లో ఆడేందుకు వచ్చిన రడనోవిచ్..భారత్ కంపుకొడుతుందంటూ సోషల్‌మీడియాలో పోస్ట్ చేసింది. భారత్‌లో ఆహారం, ట్రాఫిక్, అపరిశుభ్రతపై ఎయిర్‌పోర్ట్‌లో ఉన్న ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టింది. రడనోవిచ్ జాత్యాంహకర వ్యాఖ్యలపై పులువురు భగ్గుమంటున్నారు. భారత్‌ను ద్వేషిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదంటూ స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే తాను అలా అనలేదంటూ రడనోవిచ్ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేసింది.




# జాతీయ రెజ్లింగ్ టోర్నీకి పూజ

జూబ్లీహిల్స్: పటియాల(పంజాబ్) వేదికగా ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 5 వరకు జరుగనున్న జాతీయస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌నకు రాష్ట్ర యువ రెజ్లర్ పూజ నిత్లేకర్ ఎంపికైంది. రాష్ట్ర అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో జరిగిన అండర్–15 రాష్ట్ర స్థాయి టోర్నీలో పసిడి పతకం సాధించం ద్వారా పూజ నేషనల్ టోర్నీకి ఎంపికైంది. నగరంలోని ఎర్రగడ్డకు చెందిన పూజ ప్రస్తుతం యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నది. జాతీయ టోర్నీలో బాలికల అండర్–15 విభాగంలో ఈ యువ రెజ్లర్ బరిలోకి దిగనుంది.

# వార్నర్ వీర విహారం

### విండీస్‌పై ఆసీస్ ఘనవిజయం

హోబార్ట్: విధ్వంసక ఓపెనర్ డేవిడ్ వార్నర్ (36 బంతుల్లో 70; 12 ఫోర్లు, ఒక సిక్సర్) దుమ్మురేపడంతో వెస్టిండీస్‌తో జరిగిన తొలి టీ20లో ఆస్ట్రేలియా జయకేతనం ఎగరవేసింది. తన వందో అంతర్జాతీయ టీ20లో వార్నర్ శివాలెత్తడంతో శుక్రవారం జరిగిన పోరులో ఆసీస్ 11 పరుగుల తేడాతో విండీస్‌ను చిత్తుచేసింది. మొదట ఆసీస్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 213 పరుగులు చేసింది. వార్నర్‌తో పాటు ఇంగ్లిస్ (39), టిమ్ డేవిడ్ (37) రాణించారు. విండీస్ బౌలర్లలో రస్సెల్ 3, అల్జారీ జోసెఫ్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో వెస్టిండీస్ 8 వికెట్ల నష్టానికి 202 పరుగులకు పరిమితమైంది. బ్రాండన్ కింగ్ (53), చార్లెస్ (42), హోల్డర్ (34 నాటౌట్) పోరాడినా ఫలితం లేకపోయింది. కంగారూ బౌలర్లలో జాంపా 3 వికెట్లు తీశాడు.


వార్నర్ (70)

# తెలంగాణ కాంస్య జోరు

### జాతీయ స్కూల్‌గేమ్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాంచీ(జార్ఖండ్) వేదికగా జరుగుతున్న 67వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో తెలంగాణ యువ సైక్లిస్టులు సత్తాచాటారు. జాతీయ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన బాలుర అండర్–19 టీమ్ స్ప్రింట్ ఈవెంట్‌లో అభిశ్రయ్‌రెడ్డి, సింహాచలం, వర్షిత్, సాత్విక్‌తో కూడిన తెలంగాణ సైక్లింగ్ టీమ్ 1.20.055సెకన్ల టైమింగ్‌తో కాంస్య పతకం ఖాతాలో వేసుకుంది. ఇదే విభాగంలో రాజస్థాన్, మహారాష్ట్ర వరుసగా స్వర్ణ, రజత పతకాలు దక్కించుకున్నాయి. మరోవైపు బాలుర అండర్–17 టీమ్ స్ప్రింట్ ఈవెంట్‌లో తనిష్క్, సాత్విక్, సాయి చరణ్‌తో కూడిన రాష్ట్ర టీమ్ (1.13.274సె) మరో కాంస్య పతకం దక్కించుకుంది.



# చాలా పెద్ద తప్పు చేశాను: డివిలీయర్స్

జొహాన్నెస్‌బర్గ్: టీమ్‌ఇండియా విరాట్‌కోహ్లీకి తప్పుడు సమాచారాన్ని ఇచ్చి చాలా పెద్ద తప్పు చేశానని దక్షిణాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలీయర్స్ పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌కు బ్రాండ్ అంబాసీడర్‌గా కొనసాగుతున్న డివిలీయర్స్ శుక్రవారం కోహ్లీ విషయమై స్పందిస్తూ ‘కుటుంబానికి తొలి ప్రాధాన్యం, ఇప్పటికే దీనిపై స్పష్టత ఇచ్చాను. కానీ అదే సమయంలో కోహ్లీకి సంబంధించి తప్పుడు సమాచారాన్ని అందించి తప్పు చేశాను. విరాట్‌కు అతని కుటుంబానికి ఏదీ నచ్చితే అది జరుగుతుంది. అక్కడ ఏం జరుగుతుందో నాకు తెలియదు’ అని అన్నాడు. అనుష్క రెండో సంతానం కోసం ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు విరాట్ దూరమైనట్లు ఏబీ గతంలో వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

## చిత్రం

# తపస్సుగా భావిస్తే తప్ప సాధ్యంకాదు



‘భార్యాభర్తల మధ్య కూడా మనస్పర్థలు సహజం. చిరంజీవికీ, నాకూ మధ్య తలెత్తింది అలాంటివే. నిజానికి అప్పుడేం జరిగిందో కూడా నాకు గుర్తులేదు’ అన్నారు ప్రఖ్యాత రచయిత యండమూరి వీరేంద్రనాథ్. ఆయన చిరంజీవి జీవిత చరిత్ర రాయనున్న విషయం తెలిసిందే. ఈ విషయాన్ని స్వయంగా చిరంజీవే మీడియా సాక్షిగా ప్రకటించారు కూడా. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ విషయం గురించి యండమూరి ప్రస్తావించారు. ‘చిరంజీవితో నా బంధం ఈనాటిది కాదు. 42ఏళ్ల నాటిది. ఆయన ‘మంచు పల్లకి’ సినిమాకు మాటలు రాశాను. అప్పటినుంచి ఇప్పటివరకూ మా స్నేహం కొనసాగుతూనే ఉంది. సుదీర్ఘమైన ప్రయాణాల్లో కుదుపులు సహజం. మా మధ్య ఏర్పడిన మనస్పర్థలు కూడా అలాంటివే. ప్రస్తుతమైతే మా మధ్య ఎలాంటి విభేదాలూ లేవు’ అని తెలిపారు యండమూరి. ఇంకా మాట్లాడుతూ ‘నాలుగేళ్ల తర్వాత చిరంజీవిని కలిశాను. ఎలా రిసీవ్ చేసుకుంటారోనని భయపడ్డాను. కానీ ఆయన ఎంతో ప్రేమగా ఆప్యాయంగా పలకరించారు. నిజానికి చిరంజీవి జీవిత చరిత్ర రాయాలనే ఆలోచన నాకు చాలాకాలంగా ఉంది. ఆ వేదికపైనే నా అభిప్రాయాన్ని ఆయనకు చెప్పేశాను. ఆయన ఆశ్చర్యపోయారు. నావైపు సంభ్రమంగా చూస్తూ.. ‘నిజంగా రాస్తారా.. మీరు రాస్తే అంత కంటే కావాల్సిందేముంది.. ఇక్కడే ప్రకటించమంటారా?..’ అని అడిగేశారు. నేను సరే అనగానే.. ఆయన స్టేజ్‌పై ఆ విషయాన్ని ప్రకటించేశారు’ అంటూ ఆనందం వ్యక్తం చేశారు యండమూరి. చిరంజీవి జీవిత చరిత్ర రాయడం చిన్న విషయం కాదని, తపస్సుగా భావించి చేస్తే తప్ప సాధ్యంకాదని యండమూరి తెలిపారు.


# తమిళంలో వరుస అవకాశాలు

‘సీతారామం’ చిత్రం కథానాయిక మృణాల్ ఠాకూర్ కెరీర్‌కు గొప్ప మలుపునిచ్చింది. గత ఏడాది విడుదలైన ‘నాన్న’ చిత్రంలో కూడా అభినయ ప్రధాన పాత్రలో ఆకట్టుకుందీ భామ. ప్రస్తుతం ఆమె విజయ్ దేవరకొండ సరసన ‘ఫ్యామిలీ స్టార్’ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. తెలుగులో ఈ అమ్మడు నటించిన చిత్రాలు మంచి విజయాలు సాధించడంతో అభిమానులు అదృష్టనాయిక అంటూ అభివర్ణిస్తున్నారు. ఈ నేపథ్యంలో మృణాల్ ఠాకూర్‌కు తమిళం నుంచి కూడా భారీ అవకాశాలొస్తున్నాయి. ఇప్పటికే శివకార్తికేయన్, శింబు చిత్రాల్లో నాయికగా అవకాశాల్ని దక్కించుకున్న ఈ భామ అగ్ర హీరో అజిత్ సరసన కథానాయికగా నటించబోతున్నట్లు తెలిసింది. అదిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్ ఓ సినిమా చేయబోతున్నారు. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమాలో పలువురు అగ్ర నాయికల పేర్లు తెరపైకొచ్చాయి. తాజాగా ఆ ఛాన్స్ మృణాల్ ఠాకూర్ దక్కించుకుందని సమాచారం. తమిళంలో ఇప్పటివరకు ఒక్క సినిమా విడుదల కాకముందే భారీ అవకాశాలను దక్కించుకుంటూ సంచలనం సృష్టిస్తున్నది మృణాల్ ఠాకూర్. ఆమె తాజా తెలుగు చిత్రం ‘ఫ్యామిలీ స్టార్’ ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది.


మృణాల్ ఠాకూర్

# చరిత్రపురుషుడిగా చరణ్?

రామ్‌చరణ్ ప్రస్తుతం ‘గేమ్‌ఛేంజర్’ పూర్తిచేసే పనిలోఉన్నారు. ఈ ఏడాది దసరాను టార్గెట్‌గా తీసుకొని చకచకా చిత్రీకరణ జరుపుకుంటున్నదీ సినిమా. ఈ చిత్రం తర్వాత ‘ఉప్పెన’ఫేం బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రామ్‌చరణ్ నటించనున్న విషయం తెలిసిందే. ‘ఆర్‌సీ16’ వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం రూపొందనుంది. ఇదిలావుంటే.. అప్పుడు ‘ఆర్‌సీ17’కు సంబంధించిన న్యూస్ కూడా మీడియాలో తెగ హల్‌చల్ చేస్తుండటం విశేషం. సంజయ్‌లీలా బన్సాలీ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయనున్నారట. నిజానికి అల్లు అర్జున్ హీరోగా సినిమా చేసేందుకు సంజయ్ గతంలో ప్రయత్నించారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. తాజా సమాచారం మేరకు రామ్‌చరణ్‌తో ఆయన సినిమా సెట్ అయినట్టు వినికిడి. చరణ్ రెండుమూడు సార్లు ఈ మధ్య ముంబయి వెళ్లివచ్చారు. కారణం ఈ సినిమానే అనే టాక్ బలంగానే వినిపిస్తుంది. సంజయ్ హిస్టారికల్స్ తీయడంలో దిట్ట. ఆయన నిర్దేశకత్వంలో వచ్చిన బాజీరావ్ మస్తానీ, పద్మావత్ చిత్రాలు ఘన విజయాలను నమోదు చేసుకున్నాయి. చరణ్‌తో చేబోతున్న సినిమా కూడా హిస్టారికల్ మూవీనే అని తెలిసింది. శ్రావస్తి సామ్రాజ్యానికి చెందిన ఓ చక్రవర్తి, తన కొద్దిమంది సైన్యంతో ఘాజీ సలార్ మసూద్‌ని ఓడించి మట్టికరిపించిన వీరోచిత గాథ ఆధారంగా ఈ సినిమా రూపొందించనున్నట్టు సమాచారం. బుచ్చిబాబు సినిమా తర్వాత, వెంటనే రామ్‌చరణ్ చేయనున్న సినిమా ఇదే అని వినికిడి. అంటే త్వరలో రామ్‌చరణ్‌ని చరిత్రపురుషునిగా చూడబోతున్నాం అన్నమాట.



# బ్లడ్ బాత్ కా బ్రాండ్ నేమ్.. వయొలెన్స్ కా విజిటింగ్ కార్డ్..

బాలకృష్ణ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందుతున్న చిత్రం ‘ఎన్‌బీకే 109’. కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య కలిసి నిర్మిస్తున్నారు. ఎన్నో ప్రత్యేకత సమాహారంగా ఈ సినిమా రూపొందుతున్నదని చెప్పాలి. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో మలయాళ అగ్రహీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్నారు. ‘యానిమల్’లో విలన్‌గా నట విశ్వరూపం చూపించిన బాబీడియోల్ ఇందులో విలన్‌గా చేస్తున్నారు. గౌతమ్ వాసుదేవ మీనన్ కూడా ఇందులో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. ఇంకా కథానాయికలుగా శ్రద్ధాశ్రీనాథ్, ఊర్వశీ రౌతేలా.. ఓ విధంగా ఈ మధ్య వచ్చిన బాలయ్య చిత్రాల్లో ఇంత ప్యాడింగ్ లేదనే చెప్పాలి. కథ డిమాండ్ చేయడంవల్లే వీళ్లందర్నీ తీసుకోవాల్సి వచ్చిందని దర్శకుడు బాబీ చెబుతున్నారు.. బ్లడ్ బాత్ కా బ్రాండ్ నేమ్.. వయొలెన్స్ కా విజిటింగ్ కార్డ్.. అనిపించేలా ఇందులో బాలయ్య కేరక్టరైజేషన్ ఉంటుందని నిర్మాతలు చెబుతున్నారు. దసరా కానుకగా ఈ చిత్రం విడుదల చేయనున్నట్టు సమాచారం.



# మేకప్ లేకుండా నటించాను

మణిరత్నం దర్శకత్వంలో షారుఖ్‌ఖాన్, ప్రీతిజింతా జంటగా నటించిన ‘దిల్‌సే’ క్లాసిక్ చిత్రాల్లో ఒకటిగా నిలిచిపోయింది. ఈ సినిమా ద్వారానే ప్రీతిజింతా బాలీవుడ్‌లో అరంగేట్రం చేసింది. తన తాజా ఎక్స్ (ట్విట్టర్) పోస్ట్‌లో ఈ సినిమా తాలూకు జ్ఞాపకాల్ని నెమరేసుకుంది ప్రీతిజింతా. ఓ సన్నివేశంలో మేకప్ లేకుండా నటించానని, దర్శకుడు మణిరత్నం పొయెటిక్ విజన్‌కు ఆ సీన్ ఓ ఉదాహరణగా నిలిచిందని చెప్పింది. ఈ సందర్భంగా అలనాటి ఫోటోను షేర్ చేసింది. ‘‘దిల్‌సే’ తొలి రోజు షూటింగ్ సందర్భంగా తీయించుకున్న ఫొటో ఇది. ఆ రోజు సీన్ కోసం సిద్ధమయ్యే సమయంలో మణిరత్నంగారు నన్ను పిలిచి ముఖం కడుక్కొని రమ్మన్నారు. ‘అలా అయితే మేకప్ మొత్తం పోతుంది కదా సర్’ అని కాస్త భయంగానే చెప్పాను. ‘ఏం ఫర్వాలేదు.. ఈ సీన్‌లో మేకప్ లేకుండానే కనిపించాలి’ అని మణిరత్నం సర్ అన్నారు. అసలు అక్కడ ఏం జరుగుతుందో నాకు అర్థం కాలేదు. ఆ సీన్‌ను తెరపై చూసుకుంటే మణిరత్నంగారి క్రియేటివ్ విజన్ అర్థమైంది’ అంటూ అప్పటి సంఘటనను గుర్తుచేసుకుంది ప్రీతిజింతా. ప్రస్తుతం ఆమె ఇద్దరు పిల్లలతో పాటు లాస్‌ఏంజిల్స్‌లో స్థిరపడింది. సన్నీ డియోల్ ‘లాహోర్ 1947’ చిత్రం ద్వారా ఆమె బాలీవుడ్‌లో పునరాగమనం చేస్తుందనే వార్తలొస్తున్నాయి.




గోపీచంద్, మాళవిక శర్మ

# ఏదో ఏదో మాయ

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ‘భీమా’. ఏ. హర్ష దర్శకుడు. శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని ‘ఏదో ఏదో మాయ..’ అంటూ సాగే తొలి గీతాన్ని శుక్రవారం విడుదల చేశారు. రవి బస్రూర్ స్వరపరచిన ఈ పాటకు కల్యాణ్ చక్రవర్తి సాహిత్యాన్నందించారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ప్రేమించిన అమ్మాయి పట్ల కథానాయకుడి ఆరాధనను ఆవిష్కరిస్తూ చక్కటి భావాలతో ఈ పాట సాగింది. నాయకానాయికలు గోపీచంద్, మాళవిక మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంది. ఈ సినిమాలో గోపీచంద్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. మహాశివరాత్రి సందర్భంగా మార్చి 8న ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ప్రియాభవానీ శంకర్, మాళవిక శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: స్వామి జె గౌడ, సంగీతం: రవి బస్రూర్, సంభాషణలు: అబ్బూరి మహంకాళి, దర్శకత్వం: ఏ.హర్ష.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.